## చౌటుప్పల్ లో కాళోజీ జయంతి వేడుకలు



**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ జయంతి ఉత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మోగదాల పావని రమేష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, కౌన్సిలర్లు క్యాస్షన్ రాకేష్‌రెడ్డి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, హన్ను మహమ్మద్, కోఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, పస్తం గంగారామ్, నాయకులు ఉడుగు రమేష్, మహమ్మద్ జానీబాబా, బత్తుల దాసు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, అకౌంటెంట్, వార్డు అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జవజ్ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ



**దశ, హైదరాబాద్ :** జవజ్ సంస్థకు చెందిన నూతన ఉత్పత్తులను హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించారు. జవజ్, మ్యాక్స్‌వోల్ట్, టూపల్స్ బ్రాండ్లకు సంబంధించిన కొత్త ఉత్పత్తులను ఈ సందర్భంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులతో పాటు వ్యాపార భాగస్వాములు, పంపిణీదారులు, డీలర్లు, రిటైలర్లు, మీడియా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. నూతన ఉత్పత్తుల ప్రత్యేకతలను సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా జవజ్ సంస్థ అధినేత సాయి కిశోర్ జవ్వాజి మాట్లాడుతూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. నాణ్యత, విశ్వసనీయత, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ సంస్థను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమానికి సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన ఉత్పత్తులను ఆవిష్కరించి, సంస్థ బ్రాండ్‌కు తన సహకారాన్ని అందించారు.

## బిజెపి ఎస్సీ మోర్చా మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎ. శంకర్ రావు నియామకం



**దశ, ఓయూ:** మహంకాళి సికింద్రాబాద్ బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నార్తులాలగూడకు చెందిన ఎ. శంకర్ రావు నియమితులయ్యారు. సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం నవీన్ మరియు బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ సమక్షంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ ద్వారా శంకర్రావు నియామక పత్రం అందుకున్నారు. బిజెపి పార్టీ మరియు ఎస్సీ మోర్చా బలోపేతానికి శంకర్ రావు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, తన వంతు కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ








- ❖ *మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కుంట్లూర్ డివిజన్‌లో పెద్ద ఎత్తున నిరసన*
- ❖ *చావు డప్పుతో ర్యాలీ.. పలువురి అరెస్ట్*

**దశ, పెద్ద అంబర్ పేట :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్పీకర్ పదవిని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట్లూర్ డివిజన్‌లో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చావు డప్పుతో ర్యాలీ నిర్వహించి బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి బాధ్యతారహితంగా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులకు దళితుల పట్ల నిజమైన చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ అక్కసుతో ప్రభుత్వంపై విమర్శలు, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, దీనిని అడ్డుకునేందుకు ప్రతిపక్షం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న అక్రమాలు, అవినీతి, వివిధ స్కామ్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని గ్యారాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గత పాలనకు సంబంధించిన అంశాలను వెలికితీసి ప్రజల ముందుంచుతామని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్షం వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు.. ఆయనపై తగిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో కుంట్లూర్ డివిజన్‌లో కొద్దిసేపు రాజకీయ వాతావరణం వేడెక్కింది.

ఈ నిరసన కార్యక్రమంలో బాటసింగారం సహకార సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పండుగల రాజు, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమగోని భాస్కర్‌గౌడ్, నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి, రాజ్‌కుమార్, పాలడుగు నాగార్జున, ఎరుకల భాస్కర్‌గౌడ్, సుప్రసే నారెడ్డి, చేగురు వెంకటేష్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, సాయిగౌడ్, నర్సింగ్, శ్రీనివాసరెడ్డి, ఎస్.ప్రవీణ్‌గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామన్నపేటలో మండల స్థాయి క్రీడా పోటీలు



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ సెలెక్షన్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరై, మండల విద్యాధికారి సురేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాట్లాడుతూ.. రామన్నపేట మండలానికి చెందిన విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

క్రీడా పోటీలకు హాజరైన క్రీడాకారులకు భోజన ఏర్పాట్లు చేసిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్‌కు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. శేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు మందడి శ్రీధర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పెద్దబోయిన మణి, సరోజ, రేణుక, కొండ సాయి, చందు, కల్పన, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గర్దాస్ కరుణాకర్, జిట్టబోయిన వెంకటేష్, మేకల నరేందర్, మాధం నాగేష్, రాధారపు శ్రీనివాస్‌తో పాటు గ్రామ క్రీడాభిమానులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

- ❖ *తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా నివాళులు*



**దశ, రంగారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాళోజీ రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తున్నాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ.. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ జయంతిని నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ మాండలిక భాష, ప్రజల యాసకు కాళోజీ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలపై తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలుగు భాషతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి కేషురామ్, కలెక్టరేట్ ఏవో సునీల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ మేళాలో తెలంగాణ స్టాల్‌కు విశేష ప్రశంసలు



- ❖ *లంబాడీ సంస్కృతి, అక్షరాస్యత కార్యక్రమాల ప్రదర్శనకు జాతీయ స్థాయిలో గుర్తింపు.*

**దశ, న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని జాతీయ బాల్ భవన్‌లో నిర్వహించిన ఉల్లాస్ మేళాలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. నవభారత సాక్షరతా కార్యక్రమం (ఉల్లాస్)లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ మేళాలో తెలంగాణకు చెందిన అక్షరాస్యతా కార్యక్రమాలు, స్థానిక గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు.

ఉల్లాస్ కార్యక్రమం అమలులో తెలంగాణ రాష్ట్రం చేస్తున్న కృషిని అడిషనల్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్తి ఐఏఎస్ ప్రశంసించారు. తెలంగాణ స్టాల్‌ను సందర్శించిన ఆమె.. రాష్ట్రంలో ఉల్లాస్ కార్యక్రమం మంచి ఫలితాలను సాధిస్తోందని అభినందించారు. ముఖ్యంగా లంబాడీ జానపద సంస్కృతి, గిరిజన ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అక్షరాస్యతా కార్యక్రమాలను పరిశీలించారు. మహిళా వాలంటీర్లు అక్షరాస్యత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తీరును ప్రశంసించారు. ఉల్లాస్ కార్యక్రమంలో ఉన్నత విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులను కూడా వాలంటీర్లుగా భాగస్వామ్యం చేయాలని CNCL ప్రొఫెసర్ ఉషా శర్మ సూచించారు. విద్యార్థుల సహకారంతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు సమాజంలో విద్యపై మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కాశిపేట్ మండలంలోని లంబాడీ తండాకు చెందిన వాలంటీర్ రాజేశ్వరి చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది. ఆమె 312 మంది గ్రామస్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు మరో 32 మందికి ఉచిత వృత్తి శిక్షణలో భాగంగా కుట్టు శిక్షణ అందించారు. ఆమె సేవలను గుర్తించిన నిర్వాహకులు రాజేశ్వరి విజయగాథను సక్సెస్ స్టోరీగా ఎంపిక చేసి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ నిర్వహించారు.

మేళాలో తెలంగాణకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లంబాడీ నృత్యం, బతుకమ్మ, బోనాలు, పోతురాజు తదితర తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. డెప్యూటీ డైరెక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో DRPలు శాంఖరి, శైలజ, రాజేశ్వరి, కవిత, జ్యోతి, భూమమ్మ, రాజు, హరిలాల్ ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి ఉల్లాస్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని డెప్యూటీ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ నుమాన్ అన్నారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, అక్షరాస్యతా కార్యక్రమాల అమలు విధానాలను ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం ఈ మేళా ద్వారా లభిస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విజయవంతమైన విధానాలను పరిశీలించి, వాటిలో అనుసరించదగిన అంశాలను తెలంగాణలో అమలు చేస్తే కార్యక్రమాల ఫలితాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల సక్సెస్ స్టోరీలను, అక్షరాస్యతా కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం తెలంగాణ బృందంలో మరింత ఉత్సాహం పెరిగిందని రంగారెడ్డి జిల్లా డెప్యూటీ డైరెక్టర్ కె. అనిత తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో మరింత విస్తృతంగా అమలు చేసేందుకు ఈ మేళా ద్వారా కొత్త ఆలోచనలు, అనుభవాలు లభించాయని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో అక్షరాస్యత పెంపు కోసం వాలంటీర్లు, అధికారులు చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రశంసలు లభించడం స్ఫూర్తిదాయకమని తెలిపారు.

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని కలిసిన గోపీ శంకర్ యాదవ్

- ❖ *పలు సామాజిక అంశాలపై చర్చ.. న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచన*



**దశ, రంగారెడ్డి జిల్లా కోర్టు:** రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా ఇటీవల మిర్యాలగూడ నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి పి. పవన్‌కుమార్‌ను సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కిక్కర గోపీ శంకర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై ఇరువురు చర్చించారు. సమాజంలోని ప్రతి పౌరుడు న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి పి. పవన్‌కుమార్ సూచించారు. ముఖ్యంగా న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని, అందుబాటులో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వివాదాలను సాధ్యమైనంత వరకు రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు.

ఈ సందర్భంగా సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి తదితర అంశాలను గోపీ శంకర్ యాదవ్ వివరించారు. న్యాయ సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం క్రియాశీలక సభ్యులు, న్యాయవాదులు శ్రీమతి ఏకే పూర్ణిమ, సంగారెడ్డి జిల్లా సురక్ష ఇన్‌చార్జి శ్రీమతి హారతి, సురక్ష సభ్యులు యాకూబ్, బొడుసు పవన్‌కుమార్ యాదవ్, నాగేశ్వరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే లైన్ సాధన కొరకు లక్ష కార్డుల ఉద్యమానికి మద్దతు ప్రకటించిన శ్రీ వాసవి సేవాసమితి



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో పాటు ప్రజల అవసరాల కొరకు శ్రీ వాసవి సేవా సమితి ముందుంటుందని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ముందు రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లక్ష పోస్టు కార్డుల ఉద్యమ శిబిరం లో పాల్గొని పూర్తి మద్దతు ప్రకటిస్తూ 1000 కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని రైల్వే మార్గం వస్తే మరింత అభివృద్ధి చెందుతుంది అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రకటించిన రైల్వే మార్గం కొంతమంది స్వార్ధపరులచే సూర్యాపేట మీదుగా కాకుండా ఇతర మార్గాల నుండి మళ్ళించడం వల్ల సూర్యాపేట జిల్లా అభివృద్ధికి నోచుకోకుండా పోతుందన్నారు. సూర్యాపేట మీదుగా రైల్వే సాధన కొరకు కృషి చేస్తున్న రైల్వే సాధన సమితి కన్వీనర్ డేగల జనార్ధన్ ను అభినందించారు. రైల్వే లైన్ సాధించేవరకు శ్రీ వాసవి సేవా సమితి ఏ ఉద్యమం తలపెట్టిన మద్దతు ప్రకటిస్తుందన్నారు.

సూర్యాపేట జిల్లా మీదుగా గతంలో ప్రకటించిన విధంగా రైలు మార్గాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట నుండి రైల్వే మార్గం వెళ్లే విధంగా కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నిర్వాహకులు బిక్కుమల్ల ఉపేందర్, రాచూరి ప్రతాప్, నల్లపాటి అప్పారావు, భద్రయ్య, మంజుల, అంజయ్య, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్ శ్రీ వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్, మహంకాళి ప్రణీత్, కలకోటి నరసయ్య, సహాయ కార్యదర్శిలు కర్నాటి కృష్ణ, బచ్చు శ్రీనివాస్, తప్పి అనిల్, సోమా ధనుంజయ్, సభ్యులు పోలా లక్ష్మీనారాయణ, తాటిశెట్టి హనుమంతు, బెలిదే అంజయ్య, మహంకాళి సోమయ్య, మిట్టపల్లి రమేష్, చల్లా సత్యనారాయణ (కిరాణా) తప్పీ గాంధీ, గుడిపాటి రమేష్, గుండా వెంకన్న, ఇల్లందుల నవీన్, తల్లాడ కృష్ణమూర్తి, దేవరశెట్టి కృష్ణమూర్తి, మిరియాల వెంకటేశ్వర్లు, దేవరశెట్టి ఉమారాణి, మిట్టపల్లి శ్రీదేవి, కలకోటి అనిత, తెల్లాకుల శ్రీదేవి, గుడిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అనిల్‌కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**దశ, ఓయూ:** రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్‌కు తెలంగాణ ప్రభుత్వ ఆర్టీఏ సభ్యుడు సురేష్‌లాల్ నేతికర్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## బిజెపి నార్తులాలగూడ డివిజన్ అధ్యక్షుడిగా నటరాజ్ గౌడ్ నియామకం



దశ ఓయూ:భారతీయ జనతా పార్టీ (BJP) సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్రీ గుండగోనిh భరత్ గౌడ్ సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని పలు డివిజన్లకు నూతన అధ్యక్షులను నియమించారు. నార్త్ లాలాగూడ డివిజన్ అధ్యక్షుడిగా ఎ. నటరాజ్ గౌడ్ నియమితులైనారు. ఈ నియామకాలకు సంబంధించి బిజెపి జిల్లా కార్యాలయ కార్యదర్శి జి. కిరణ్ కుమార్ అధికారిక ప్రకటన విడుదల చేశారు.



## పక్కా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలంటూ ఆందోళన

**దశ, ఓయూ:** అర్ధాంతరంగా నిచిపోయి సుధీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పక్కా రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలనీ ఇందిరానగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం స్థానికులంతా శివాలయం వద్ద గుంతలయంగా మారిన మట్టి రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరానగర్ లోని శివాలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వేసారు. తిరిగి రోడ్డు నిర్మాణం చేపట్టకుండా రైల్వే అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారంటూ జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండానే వదిలేసారనీ ఇందిరానగర్ వాసులు మండిపడుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. కనీసం అధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో బురదమయంగా, చలికాలం, ఎండా కాలంలో గుంతల మయంగా, దుమ్మురేగుతున్న ఈ రోడ్డుతో |నిత్యం శివాలయానికి వెళ్లే భక్తులు సరైన రోడ్డు లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం వినాయ చవితి పండుగ సమీపిస్తుంది ఇక్కడ జరిగే వేడుకలకు కాలనీ వాసులంతా హాజరైతారు. కావునా అధికారులు స్పందించి వెంటనే పక్కా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఇందిరానగర్ వాసులు పాల్గొన్నారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జీవన్‌కు డాక్టరేట్

❖ *ఓయూ 85వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా స్వీకరణ.*



**దశ ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన జీవన్ కుమార్ సంస్కృతం విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. 2026 సెప్టెంబర్ 8న నిర్వహించిన విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఎన్నో సంవత్సరాల నిరంతర అధ్యయనం, పరిశోధన, కఠోర శ్రమతోపాటు అనేక సవాళ్లను అధిగమించి జీవన్ కుమార్ ఈ ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించారు. మంచిర్యాల గడ్డపై ప్రారంభమైన ఆయన విద్యా ప్రస్థానం, చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేదికపై డాక్టరేట్ పట్టాను స్వీకరించే స్థాయికి చేరుకోవడం విశేషం...

విద్యార్థి దశ నుంచే జీవన్ కుమార్ సామాజిక, విద్యార్థి ఉద్యమాల పట్ల చురుకైన పాత్రను పోషించారు. నిజాం కాలేజీలో విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, విద్యార్థుల సమస్యలతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించారు. తదనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఓయూ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తూ విద్యార్థులు, యువతకు సంబంధించిన అనేక ఉద్యమాలు, కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. విద్యార్థి ఉద్యమ ప్రస్థానంలో ఆయనకు లభించిన అనుభవం, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ ఆయన విద్యా, పరిశోధనా ప్రయాణానికి కూడా తోడ్పడ్డాయి.

ఈ సందర్భంగా జీవన్ కుమార్ మాట్లాడుతూ, "పీహెచ్‌డీ పట్టా" పొందడం నా జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అపురూపమైన ఘట్టం. నా కృషికి లభించిన గుర్తింపుగా, నా పట్టుదలకు దక్కిన విజయంగా దీనిని భావిస్తున్నాను. ఈ విజయం నా ఒక్కరిది కాదు. నా విద్యా ప్రయాణంలో అడుగడుగునా అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, మార్గనిర్దేశం చేసిన గురువులు, ప్రోత్సహించిన మిత్రులు, శ్రేయోభిలాషులు అందరిదీ" అని పేర్కొన్నారు.

తనపై విశ్వాసం ఉంచి, పరిశోధనా ప్రయాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన ప్రస్థానం, పరిశోధకుడిగా ఎదిగి సంస్కృతంలో డాక్టరేట్ సాధించే స్థాయికి చేరుకోవడం జీవన్‌కుమార్ పట్టుదలకు, నిరంతర కృషికి నిదర్శనంగా నిలిచింది. 'డాక్టర్ జీవన్ కుమార్'గా ఆయన తన జీవితంలో మరో నూతన అధ్యాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, సహచరులు, గురువులు, శ్రేయోభిలాషులు డాక్టర్ జీవన్‌కుమార్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఆయన భవిష్యత్ విద్యా, సామాజిక ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## కొమ్ము శేఖర్ మాదిగకు ఓయూ డాక్టరేట్



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కొమ్ము శేఖర్ మాదిగ పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ నెల 8న ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్, ఓయూ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా అధ్యక్షతన, భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా, వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా పట్టా స్వీకరించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై.పార్థసారథి పర్యవేక్షణలో 'తెలంగాణలో పట్టణ సుపరిపాలన దిశగా మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సామర్థ్య నిర్మాణం' అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామానికి చెందిన శేఖర్ విద్యార్థి ఉద్యమాలు, సామాజిక న్యాయ ఉద్యమాల్లో చురుకుగా పనిచేస్తూ ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడిగా, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన శేఖర్‌ను ఓయూ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్ నాయకులు అభినందించారు.

## విలీన ప్రాంతాల ఉద్యోగులకు సవరించిన HRA ఇవ్వాలి



**దశ, ఓయూ:** మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కొత్తగా విలీనమైన గ్రామాలు, ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సవరించిన ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ)ను వెంటనే వర్తింపజేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ పరిధి విస్తరించినా విలీన ప్రాంతాల ఉద్యోగులకు పాత రేట్ల ప్రకారమే హెచ్ఆర్ఏ చెల్లిస్తున్నారని శాసన మండలిలో ప్రస్తావించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జమ్మికుంట, హుజూరాబాద్ తదితర ప్రాంతాల పరిధి విస్తరించిన నేపథ్యంలో అక్కడి ఉద్యోగులకు కొత్త హెచ్ఆర్ఏ రేట్లు వర్తింపజేయాలని కోరారు. పాత రేట్లతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నందున ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

*సిఐ చరమంద రాజు*

**దశ, హుజూర్‌నగర్:** ఈ నెల 12 తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్ నగర్ సీఐ జి.చరమంద రాజు ఒక ప్రకటన లో కోరారు. రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు,మోటారు ట్రాన్స్పోర్ట్ రోడ్డు నిభందనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ,చెక్ బౌన్స్ ఇలా రాజిపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చు అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు.



## కూకట్‌పల్లిలో ఫుడ్ మాఫియాపై ఉక్కుపాదం!

❖ *20 సంస్థల్లో తనిఖీలు.. కుళ్లిన ఆహారం, పురుగుల బాగోతం!*




**దశ, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ప్రాంతంలో TG SAFE ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పది ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రంగంలోకి దిగి రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, హాస్టళ్లతో కలిపి మొత్తం 20 ఆహార సంస్థల్లో తనిఖీలు చేపట్టాయి. అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాలకు సంబంధించి 20 శాంపిళ్లను అధికారులు సేకరించారు. తనిఖీల్లో పలు సంస్థల్లో చెడిపోయిన లేదా కలుషితమైన ఆహారం, పురుగుల బెడద, అపరిశుభ్రమైన పరిసరాలు, శుభ్రంగా లేని రిఫ్రిజిరేటర్లు, వెజ్-నాన్‌వెజ్ ఆహార పదార్థాలను వేరు చేయకపోవడం, గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం, ఫుడ్ హ్యాండ్లర్ల వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. చెడిపోయిన, పురుగులు పట్టిన ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే పారవేయించారు. కూకట్‌పల్లిలోని GVK New Luxury PG Men's Hostel ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్/రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించడంతో పాటు ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి మూసివేశారు. మరో ఐదు సంస్థలపై లైసెన్స్ సస్పెన్షన్ చర్యలు ప్రారంభించడంతో పాటు కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలు ఆహారం కొనుగోలు చేసే సమయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్/రిజిస్ట్రేషన్, ఆహార పదార్థాల తాజాదనం, లేబుల్స్, నిల్వ విధానం, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు. లైసెన్స్ ఉన్న సంస్థల నుంచే ఆహారం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి.

## మంగపేట అంగన్వాడీలో పోషణ మాస కార్యక్రమం

**దశ, ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని మాదారం పంచాయతీ పరిధిలోని మంగపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సామ్రాజ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, బూసమ్మ, రమాదేవి, లీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సామ్రాజ్యం మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు పోషణ అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. గ్రామాల్లో సులభంగా లభించే పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, మాంసం, గుడ్లు, చేపలు తదితర ఆహార పదార్థాల్లో ఉండే పోషక విలువలను ఆమె వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురై ఆసుపత్రులు, మందుల కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సామ్రాజ్యం, టీచర్లు సుజాత, రమాదేవి, బూసమ్మ, లీలతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కక్షపూరితంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.....
# మాణికేశ్వరి నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**దశ, ఓయూ:** అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కక్షపూరితంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతీ హరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం మాణికేశ్వరి నగర్ కమాన్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కక్షపూరితంగా సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం దారుణమని, నిరంకుశంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆలకుంట హరి, బాలకిషన్ గౌడ్, విష్ణు, ఆలకుంట అరుణ్ కుమార్, వేముల లక్ష్మీనారాయణ, బోనగిరి నటరాజ్, మహ్మమ్మద్ ఇమ్రాన్, సాయి, వరికుప్పల త్రినాథ్, ఆలకుంట వెంకటేశ్, ఆలకుంట కమార్ తదితరులు పాల్గొన్నారు.